

# పిట్టమెచ్చినపల్లె

భూపాల్ · లేఖా నవలిక

గురువారం.

6.11.80

అంబర్‌పేట్

హైద్రాబాద్.

నా వసంతా!

నిన్ను జూడ్దామని, నిన్ను జూసిన సంతోషంల నా కండ్లల్ల వెలిగే నూరు దీపాల వెలుగు నువ్వు జూడాలని, దీపావళి పండుగ సాకు తోటి ఆడికి రావాలనుకున్న. బట్టలు గిట్టలన్ని సర్దేసుకున్న. మురువంగ మురువంగ ముక్కుల శీమిడి తొక్కుల వద్ద దన్నట్టు. "నువ్వు వోతె నేను వోతె బర్లెంగాను" అన్నది పెద్దమ్మ. ఇగ నా పయనం బొంద్రాయి కాడ తెల్లారింది. ఆమె చెల్లె బిడ్డ పెండ్లట దీపావళి ఎల్లంగనే. ఈమెనె పెండ్లి పెద్దమనిషి. వారం రోజులు అస్సలు తీరదు బిడ్డా! నేను రాంగనె పోదువు. ఇంత కాలం లేంది ఇవ్వడా పొయ్యేది అంటుంది. ఇగ నేనేం మాట్లాడాలె? బెల్లం కొట్టిన రాయి లెక్క నిలవడ్డ. ఇయ్యాల పగటాలే ఆమె భోనగిరికి పొయ్యింది. నాకోసం ఎదురు జూసుకుంట ఎంత బాధ పడ్తవో అని ఎవ్వడు పొద్దూకుతదా అని జూస్న. ఇంకా పాలడబ్బాలు కడుక్కోవాలే, బర్లకు కూడిద పొయ్యాలే, గడ్డెయ్యాలే ఐనా మొదాలు నీకు ఉత్తరం రాస్తందుకు కూసున్న. నీ దెగ్గరికెళ్ళి ఉత్తరం రాలేదు. రెండు వారాలు దాటింది. నామీద కోపమొచ్చిందా? తీర్తలేదా? ఇంకేమైనా నేను తల్వని అవాంతరం జరిగిందా? తెలుస్తలేదు. ఇది చేరంగానే పనికి కూడ పోకుండ జవాబు రాయాలే.

నీకో దేశం మీది ముచ్చట రాయాలేగా! ఇగో! "ప్రజల విశ్వాసాల్ని పోలీసులు చూరగొనాలి" అంటున్నాడు మనకేంద్ర హోంమంత్రి జైల్‌సింగ్. ప్రజల్ల నమ్మకాల్ని, మంచితనాన్ని పెంచుకోవాలట, అమాయకులకు, బలహీనులకు, డబ్బులేని వాళ్ళకు అండ ఉండాలట పోలీసులు. రాజకీయనాయకుల మద్దతులేని వాళ్ళకు, చదువులేనివాళ్ళకు తోడు ఉండాలట. చూస్నవా! ఈ చెప్పిన మాటల పోలీసులు ఎవరి కొమ్ము కాస్తుంద్రు. అల్ల బలగమంత ఎవరికోసముంది. ఆళ్లు ప్రజల కెంత దూరమున్నరో తెలుస్తలేదూ? అగో గట్ల వుంది మన రాజ్యాంగం మన ప్రభుత్వం.

ఈ నడుమ పొద్దూకంగ రోడ్డు మీద కాలుకు దెబ్బ తాకి నాలుగేండ్ల పిలగాడు ఏడుస్తుంటే ఆ మొకం జూసి నేను పాలు పోసే ఇంటి పిలగాడేనని దెగ్గరికి పోయిన. పేరు అడిగితే 'భాస్కర్' అన్నడు. ఏమైందంటే రోడు దాటుతుంటే ఎవరో స్కూటర్ తాకిచ్చి పోయిండట. ఒక్కనివి ఎక్కడికెళ్లి ఒస్తున్నవంటే "స్కూలు నుండి ఒస్తున్న ఇయ్యాల ఆయ రాలేదు. నేనే ఒస్తున్న అన్నడు. ఆ బాబు కాలుకి దెబ్బ బాగానే తాకింది. పట్టి కట్టిచ్చిన. ఇంటి దెగ్గర ఇడ్సిపెట్న. ఇంటికి తాళమేసుంది. "మరి ఎక్కడుంటవ్? మీ అమ్మేది? తాళముందిగా? అన్న. అంతల "ఏమైంది బిడ్డా? పిలగాని కాలుకు దెబ్బ తాకిందా? ఎట్లరా పిలగా?" అనుకుంట ఓ ముసలామె ఒచ్చింది.

"రోడు దాటుతుంటే ఎవరో స్కూటర్.."జరిగింది చెప్పిన.

"నువ్వు పాలు పోసే పిల్లగానివి గద? నయమే గుర్తు పట్టి ఇంటికి దీస్కొచ్చినవ్. నీ కడుపు సల్లగుండ"

"పెద్దమ్మా ఈ ఇంటికి తాళముంది. మరి పిలగాడేడుంటడు? ఆమె ఏడికన్న పొయ్యిందా?"

"ఆమె రోజుంటదా! బిస్కట్ల కంపిన్ల పనిజేస్తది. ఈ పిలగాన్ని స్కూలు దెగ్గర పొద్దున ఇడిసిపెడితే పొద్దూకే ఒస్తది. స్కూలు ఇడిసినంక రోజు ఆమె తోల్కొస్తుండే. ఇయ్యాల దానికేమొచ్చిందో? ఈడు స్కూలుకెళ్ళి ఇవ్వడు రాంగనే పొద్దున ఆల్లమ్మ మా ఇంట్ల పెట్టిన బువ్వ తింటడు. ఇంటి ముంగట్నే ఆడుకుంటడు. ఆమె ఆరున్నరకొస్తది. "గతిలేక కాదు బిడ్డా. మంచిగున్నోళ్లే వారి కర్మమట్ల గాలింది. మొగడు అన్యాయం జేసినందుకు..." అవ్వ ఇంకా చెవుతుంది. గని నాకు అప్పటికే శాన పొద్దు పొయ్యింది. బర్ల పాలు పిండాలే మల్ల గలుస్తనని చెప్పి ఒచ్చేసిన.

మర్నాడు పాలు పోస్తుంటే ఆమె "నిన్న మా బాబుకు పట్టిగట్టిచ్చినవట గదా! ఎన్ని పైసలైనయ్. ఇగో తీస్కో అంట పది రూపాయలియ్య పొయ్యింది. ఒద్దన్న. ఎంతనో బలవంతం జెయ్య వొయినా తీస్కోలే. ఎన్కశిరి జెరంత ఆమె తోటి, ఆ కుమ్మరి ముసలమ్మ తోటి, అల్ల ఈల్ల తోటి తెలిసింది ఆమె ఎంత నిప్పసొంటి చరిత్రున్న మనిషో.

ఈడికి దగ్గర్నె వున్న విద్యానగర్‌ల ఈమె నాయినకు బట్టల దుకాణముంది. శాన బాగ పైసలున్న కుటుంబం కాకున్నా జెర ఉన్నదే. తల్లీ, తండ్రీ, అక్కలు, అన్నలు ఉన్నరట. ఈమె పేరు శశిరేఖ. వనితా కాలేజిలో బి.ఏ. సదువుతున్న రోజుల్ల ఇ.సి.ఐ.ఎల్.ల పనిజేస్తున్న యువకుని తోటి సోపతయింది. పేరు మధసూదనరావు. ఇద్దరు రెండేండ్లు సిలకగోరెంక లెక్క తిరిగింద్రు. సిలికి సిలికి వాన లెక్క సోపతి పెండ్లికాడికొచ్చింది. కులాలు వేరు. ఇద్దరిండ్లల్ల పెద్దలు పెండ్లికొప్పకోలేదు. ఐనా ప్రేమ గొప్పదని, ప్రేమల త్యాగముందనీ, ఇది జన్మ జన్మలకు విడదీయరాని బంధమనీ, మనం పుట్టినప్పుడే పెండ్లి జరిగిందనీ ఆయిన ఆమెకు అన్నీ జెప్పిండు. ఆకాశానికి ఎక్కిచ్చిండు. ఇగ ఎట్లయితేంది కొంత మంది దోస్తులు కలసి తల్లిదండ్రులెవ్వరు రాకున్నా యాదగిరి గుట్టమీద పెండ్లి జేసింద్రు. సుట్టాలకెవ్వరికీ తెల్వదు. ఎన్కశిరి తెలిస్తె శశిరేఖ తల్లిదండ్రి ఏడ్చి అది సచ్చిపోయిందనుకున్నరు. మనసు కుదార్థెం జేసుకుంద్రు. మధుసూదన్ తల్లిదండ్రులేమో 'ఆ పిల్లనిడిసి పెట్టి ఇంటికి రా లేకుంటే రాకన్నరు. 'కొత్త సంసారం మూడునెల్లు ముచ్చటగా సాగింది.

శశిరేఖకు తెల్వకుంటనే మధుసూదనరావు తల్లిదండ్రులు, అన్నలు మెల్లమెల్లగ ఆస్తి ఆశ జూవుకుంట అన్ని అల్లదిక్కు తిప్పకోవట్టింద్రు. ఈమె కడుపుల బాబు పడ్డడు. ఆడు కనిపిచ్చుటే బంద్రైంది. తనను మంచి చెడ్డా సూసె దిక్కులేక ఇంటి కిరాయి కట్టజాలక ఆనికోసం ఎక్కడెక్కడ కలిసేదో అక్కడక్కడ తిరిగి తిరిగి కలుసుకుని తనకు అన్యాయం జెయ్యొద్దని వేదుకుంది.

ఏడ్చింది. కాళ్లమీద పడ్డది. అడు దొంగలెక్క తప్పుకొనవట్టిండు. ఇగ అన్నలు అన్ని కంపెనికి రాకుంట జేసి మూడు లక్షల యాభైవేల కట్నం తీస్కాని ఇంకో పెండ్లి జేసి వరంగల్ల ఏదో ప్రైవేటు బస్సు సర్వీసుల భాగమిచ్చి కూపోపెట్టిండ్రట.

శశిరేఖ తర్వాత దెల్సుకొని అని ముంగటనే పావమిదుద్దామనుకున్నది. అట్లజెయ్యలే. అన్నే నంపేద్దామనుకున్నది. నంపలే. కడుపుతీపిచ్చుకుని పొయ్యి అమ్మనాయినల కాళ్లమీద పడుతా అనుకుంది. అదీ చెయ్యలే! ఎవ్వరి దెగ్గరికి పొయ్యి వెయ్యి జావలేదు. యాదగిరి నరసింహ్మస్వామి సాక్షంగన్న పుస్తె •వుటుకున్న తెంపి రోడ్డుమీద చెత్తకుండిల వడేసింది. ఆ కిరాయింట్లున్న సామాన్లన్ని అన్మేసింది. ఒంట జేసే గిన్నెలు, బకీటు, బిందె, గవ్వి గవ్వి ఉంచుకుంది. అంబర్‌పేట పాముల బస్తీల ఒకరేకులింట్ల ఒక్క కోటేడు యాభయి రూపాయలకిరాయికి తీస్కాని ఒక్కతే వుంటుంది. ఎట్ల తిప్పల వడి బిస్కెట్ల కంపిన్ల పని పట్టుకుందో! అదే పని ఇంతకాలం సంది జేస్తుంది. పిలగాన్ని గన్నది. బడిలేసింది. బడిల శరీకు జేస్తుంటే తండ్రి ఎవ్వరంటే తండ్రిలేదు సచ్చిపొయ్యిండు అన్నదట. ఐనా పేరు చెప్పమంటే 'శశిధర్' అన్నదట. ఇంటిపేరంటే ఏమిలేదు అన్నదట. ఆడు అర్థంకాక మొఖం జూస్తే 'ఆ ఏమిలేదు' మల్లన్నదట. ఐనా తెలువక 'ఎమ్మో మారి భాస్కర్' అని రాశిండట. ఇప్పటికి సాటుంగ మాటుంగ ఆరునెల్లకోసారి తల్లితప్ప ఆమె దెగ్గరికి ఎవ్వరూ రారట. తల్లి ఒచ్చీ ఏడ్చి సూసిపోతదట.

ఆమె ధైర్యం చాల గొప్పది. పొద్దుకి ఒచ్చినంక బస్తీలున్న చిన్న చిన్న పిల్లలకు సదవు జెప్తది. అందరు ఆమెను ప్రేమతోటి జూస్తరు. ఎవరో శావ దెగ్గరోళ్లు మల్ల పెండ్లి చేసుకోవా బిడ్డా! అంటే నవ్వి ఊకుంటదట. ఈ సమాజంల ఇగ ఆ పిలగాడు ఎట్ల పెర్గుతడో సూడాలె. ఆమెనైతే మండుతున్న కనరాని అగ్నిపర్వతం లెక్కుంటది. రాత్రి పొద్దు పొయ్యేదాక, మల్ల తెల్లారెగట్ల పుస్తకాలు చదువుకుంట ఏదో ఆలోచన చేస్తుంటది.

వసంతా! ఇది అమ్మ ఏలుతున్న రాజ్యంల ఆడిబిడ్డెలకు జరుగుతున్న మేలు. ఇంతకన్న దారునంగ ఉన్న వందలవేల సమస్యలు బాగు జేస్తం, మేలు జేస్తమన్న మాటలే గని ఆచరణ సున్న.

చలి మిక్కుటమైంది. ఏదన్నా కోటుంటే బాగుండుననిపిస్తుంది. చలికాలం ఉన్ని బట్టలు పెయ్యికి వెచ్చగుంచుతయి. ఎందుకో తెలుసా? 'ఉన్ని అధమ ఉష్ణవాహకము' ఇది శరీరం వేడిమిని బైటికి పోనియ్యదు. నీకోసం ఒక మంచి స్వెటరు గొన్న. గాజులు, రెండు చీరెలు కొన్న.

నీ ఉత్తరం కోసం ఎదురు జూస్తున్న


నీ

చంద్రం.


6.11.'80.

## మనం

మనం మనంగా మిగలం
గింజుకుంటాం గానీ ఎంతకీ పెగలం
ఘోషించే ఆత్మలకు ఉరిబిగిస్తూ ఉంటాం
అవయవాలు స్పందించే కలలు కంటాం
అన్నిభాషా ప్రయోగాలు చేస్తూ
అరిచే అవ్యక్తులమౌతాం
మనం పక్కవారిని కూడా వినలేకపోతాం
అభిప్రాయాలకు అడ్డుకప్పిన ఘోషాలమౌతాం
వ్యథలకు కలియబడతాం.
మనం అనుకుంటామే కానీ ఎంతకీ ఏదీ అనం
వేన వేల చీలికలు తునాతునకలవుతాం
మనం చలించే అచలాలం.
నోళ్లు తెరిచిన గండశిలలం.
కమ్ముకోని మేఘాలం
కురియని వర్షాలం.
గడ్డకట్టిన దుఃఖాలం
మనం స్వచ్ఛమైన మౌన సముద్రాలం
విప్పుకున్నామనే నటనలు మనమనస్సులవి
నడిచే స్తంభాలమై మనం
బిగపట్టిన ఊపిరులమై మనం
మనమీద మనమే తిరగబడ్డ కోరికలం
వెలుతురలులో సంచరించే చీకటి జీవాలం
మనం -కేవలం మనం కాని మనం



— వేణుసంకోజు



## హైకూలు

పండుటాకులా
'నిన్నటిరోజు'
అలా రాలిపడిందో - లేదో...
ఇలా శీర్షం నుండి చీల్చుకొస్తోంది
చిగురుటాకులా రేపటి రోజు

రాత్రి యుద్ధంలో... అంటిన
చీకటి రక్కసి చిక్కట నెత్తురుతోనే
వొచ్చేసాడు ఉదయాన్నే
తూర్పున సూర్యుడు

ఆమె స్నేహం...శీతల చందనమై
అతని కన్నుల కారు మబ్బుల్ని...తాకంగనే
అవి అనురాగాన్ని వర్షిస్తున్నాయి!!!

— ఎడ్వర్డ్‌రాజ్ తిర్రే.